క్లుప్తంగా

ఎస్టీ కాలనీలో విద్యుత్ దీపాలు



విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : బాలిరెడ్డిపల్లి పంచాయతీ ఇంద్రనగర్, బాలాజీ నగర్ గ్రామాలలో ఆదివారం సర్పంచ్ బాబు రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. చాలా రోజుల నుంచి గ్రామంలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో గ్రామస్తుల ఇబ్బందులు గుర్తించి సర్పంచ్ విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కరుణించమ్మా.. నల్ల గంగమ్మ



భక్తులకు దర్శనమిస్తున్న నల్లగంగమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవర రాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. ముందుగా ఆలయాన్ని శుద్ధి చేయగా అనంతరం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలానే ఆలయంలోని బీజాక్షరాలతో ఉన్న మహిమగల రాయిపై భక్తులు పొర్లుదండాలు పెట్టారు.

మహిళలకు ఇచ్చిన హామీలను కూటమి నిలబెట్టుకోవాలి



పల్లె మాధవి

నందలూరు : వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలిగా మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పల్లె మాధవి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. మహిళల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పని చేస్తానని, అలానే కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చి హామీలను అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అయినా పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల వారి ఓట్ల కోసం అమలు చేయలేని హామీలను గుప్పించి, ఇప్పుడు దాటవేసే ధోరణిని అవలంభించడాన్ని తప్పుబట్టారు. మహిళల రక్షణకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలను తీసుకోవాలన్నారు. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు (ఎంపీ) మేడా రఘునాథ రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలకు శవాన్ని తీసుకెళుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని ఇంద్రా బస్సు షెల్టర్ వద్ద అనాథ వృద్ధురాలు చనిపోయిన సంఘటన తెలుసుకొని వైఎస్సార్‌సీపీ నాయకులు మందల నాగేంద్ర, సీహెచ్ రమేష్‌లు అక్కడికి చేరుకొని పోలీసుల అనుమతితో ఆదివారం శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న స్థానికులు వైఎస్సార్‌సీపీ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నందాబాల తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణం.. భక్తజన పరవశం

గ్రామగ్రామాన శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం వైభవోపేతంగా జరిగాయి. ఉదయాన్నే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి రామాలయాలకు చేరుకుని శ్రీరామ చంద్రుడిని దర్శించుకుని, పూజలు చేయించారు. అనంతరం ఆయా ఆలయాల్లో జరిగిన కల్యాణ వేడుకల్లో భక్తులు పాల్గొని పరవశించిపోయారు. వాడవాడలా శ్రీరాముడికి ఇష్టమైన పానకం, వడపప్పులను భక్తులకు పంచి పెట్టారు. అలానే ఆలయ కమిటీలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలలో భక్తులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



నందలూరు: సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న ఉభయదారులు



నందలూరు: కల్యాణానికి పెద్దఎత్తున హాజరైన మహిళలు



గాలివీడు : సీతారాముల కల్యాణోత్సవానికి తాంబూలం తీసుకొస్తున్న భక్తులు



ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లిలో కల్యాణోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సంబేపల్లె : శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం





లక్కిరెడ్డిపల్లె: శ్రీ సీతారామ కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం, కల్యాణ వేడుకకు హాజరైన భక్తులు



సిద్దవటం : భక్తులకు భోజనం వడ్డిస్తున్న బెటాలియన్ కమాండెంట్ ఆనందరెడ్డి



వీరబల్లి : సీతారాముల కల్యాణ క్రతువును జరుపుతున్న వేదపండితుడు



పెనగలూరు : ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సీతారామలక్ష్మణులు



చిన్నమండెం : బలిజపల్లెలో సీతారాముల కల్యాణోత్సవం



చిన్నమండెం : గ్రామోత్సవంలో చిన్నారుల కోలాట ప్రదర్శన



రాజంపేట టౌన్ : కూచివారిపల్లెలో కౌసల్యాదేవి ఒడిలో బాలరాముని అవతారంలో కోదండరాముడు



రాజంపేట టౌన్ : బలిజపల్లె రోడ్డులో కోలాటం వేస్తున్న మహిళలు



సుండుపల్లె: మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లెలో..



సుండుపల్లె : ప్రత్యేకమైన వాహనంలో సీతారాముల గ్రామోత్సవం





రైల్వేకోడూరు అర్బన్ : పాల్గొన్న భక్తులు, బయనపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆదర్శప్రాయుడు శ్రీరాముడు

నందలూరు : ధర్మానికి ప్రతిరూపమైన శ్రీరాముడు సర్వకాలాలలో సకల లోకాలలో మానవులందరికీ ఆదర్శప్రాయుడని తిరుమల, తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా స్థానిక సౌమ్యనాథ స్వామి దేవాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన ధార్మికోపన్యాసం చేశారు. శ్రీరామనవమి విశిష్టతను గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచార పరిషత్తు రాయలసీమ జోన్ సూపరింటెండెంట్ డిల్లీ రెడ్డి, ఉమిడి కడప జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ డాక్టర్ టి.గోపీబాబు, ఆలయ వేదపండితులు సునీల్ స్వామి, సాయి స్వామి, సుమంత్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



కనుల పండువగా కల్యాణ వేడుక



శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి మండిపల్లి దంపతులు

రాయచోటి టౌన్ : శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం శ్రీరామాలయాలలో శ్రీ నామనవమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ క్రమంలో రాయచోటి పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో, జగదాంబ సెంటర్‌లో వెలసిన శ్రీ సీతారామాలయంలో, రెడ్డీస్ కాలనీలో వెలసిన రామాలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణలో శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత భక్తి శ్రద్ధలతో కల్యాణం జరిపించారు. స్వామివారి కల్యాణానికి అమ్మవారికి, స్వామివారికి రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆయన పేరున స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం జగదాంబ సెంటర్‌లోని శ్రీరామాలయంలో, రెడ్డీస్ కాలనీలో కాల్వ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్వామిమి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు భక్తులకు అన్నప్రసాదాలను కూడా అందజేశారు. ఆయా ఆలయాల వద్ద జరిగిన కల్యాణ వేడుకల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఆలయ కమిటీలు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

గ్రామగ్రామాన.. శ్రీరామ నామస్మరణ



సీతారాముల కల్యాణ వేడుకలలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి దంపతులు

రాజంపేట రూరల్ : సుగుణ సుందరుడు, ఏకపత్నీ వ్రతుడు, తండ్రిమాట జవదాటని తనయుడు, అవతార పురుషుడు అయిన శ్రీరామచంద్రమూర్తి జన్మదిన వేడుకలు ఆదివారం అంబరాన్నంటాయి. మండల పరిధిలోని ప్రతి ఇంట సీతారాములకు విశేషంగా పూజలు చేశారు. ఉదయం నుంచే గృహాలను మామిడి తోరణాలతో అరటి బోదులతో అలంకరించారు. అదే విధంగా రామాలయాల వద్ద పందిళ్లు వేసి తోరణాలు కట్టి ప్రత్యేకంగా అలంకరించుకున్నారు. స్వామి వారికి ఇష్టమైన పానకం, వడపప్పు నైవేద్యంగా అందజేశారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాలలోని రామాలయాల వద్ద ఊరిలోని వారంతా చందాలు వేసుకొని సీతారాముల కల్యాణం నిర్వహించటం పరిపాటి. అందులో భాగంగా ఆదివారం అధిక గ్రామాలలో సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిపారు. వేడుకలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక ఆసనంపై కొలువుదీర్చి వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ కల్యాణ క్రతువును చేయించారు. మండల పరిధిలోని అచ్చనపల్లి గ్రామంలో నిర్వహించిన రాములోరి కల్యాణంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, అమరజ్యోతి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. ఆయన మాట్లాడుతూ శ్రీ రామచంద్రుని చల్లని దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. శ్రీరామనవమి వేడుకలలో భాగంగా మండల పరిధిలోని భువనగిరిపల్లిలో ఆదివారం శ్రీరామచంద్రమూర్తి అవతారంలో సీతారాములను ప్రత్యేకంగా కొలువు దీర్చి అలంకరించారు.

సకల జన లోక సంరక్షణే శ్రీరామనవమి

వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డిలు



యర్రంరెడ్డిగారిపల్లె రామాలయంలో పూజలల్లో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి దంపతులు

రాయచోటి జగదాంబసెంటర్ (రామాపురం) : సకల జన లోక సంరక్షణే శ్రీరామనవమి అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డిలు అన్నారు. రామాపురం మండలం సుద్దమళ్ల గ్రామం యర్రంరెడ్డిగారిపల్లెలోని రామాలయంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో కుటుంబసమేతంగా, హసనాపురం గ్రామం ఊటుకూరువాండ్లపల్లెలో జరిగిన కల్యాణ వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ సకల గుణాభిరాముడు, పితృవాక్య పరిపాలకుడు శ్రీరాముని కరుణా కటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతులు, ప్రజలందరూ సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని వారు ఆకాంక్షించారు.

నిరంతరాయంగా భక్తులకు అన్న ప్రసాదాలు



భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న సిబ్బంది



ఆకట్టుకుంటున్న రావణుని వధిస్తున్న రాముడి సెట్టింగ్

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాలకు విశేషంగా విచ్చేసే వేలాదిమంది భక్తులకు నిరంతరాయంగా రుచికరమైన అన్న ప్రసాదాలను టీటీడీ అందిస్తోంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరాయంగా తాగునీరు, మజ్జిగ అందిస్తునారు. ఆలయ ప్రాంగణంలో ఎండవేడిమి భక్తులకు ఇబ్బంది లేకుండా జర్మన్ షెడ్లు, కూలర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రతిరోజూ ఉదయం 7.30 గంటలకు అల్పాహారం, ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు రుచికరమైన అన్నం, సాంబారు, రసం, మజ్జిగ, పచ్చడి, కర్రీ, బెల్లం, పొంగళి అందిస్తారు. ఇందు కోసం దాదాపు 50 మంది టీటీడీ అన్నప్రసాదం విభాగం సిబ్బంది పనిచేస్తున్నారు.

వడపప్పు, పానకం పంపిణీ

శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా స్వామివారి దర్శనానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు ఆలయ ప్రాంగణంలో శ్రీవారి సేవకులు ద్వారా ఆదివారం ఉదయం నుంచి వడపప్పు, పానకం పంపిణీ చేశారు. దక్షిణ భారతదేశంలోని రామాలయాలలో శ్రీరామ నవమి సమయంలో శ్రీరాముడికి పెద్ద కుండలలో పానకం, వడపప్పు నైవేద్యంగా సమర్పించిన తరువాత భక్తులకు అందించారు.

భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్న సెట్టింగ్

శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంపూర్ణ రామాయణం సెట్టింగ్ భక్తులను ఎంతగానో ఆకర్షిస్తుంది. ఇందులో రామాయణంలోని వివిధ ఘట్టాలను తెలియజేసే శ్రీరామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను ఉయ్యాలలో పవళిస్తున్న దశరథుడు, కౌసల్య, సుమిత్ర, కైకేయి విశ్వామిత్ర మహర్షి యజ్ఞ రక్షణార్థం మారిచా సుబాహు అనే రాక్షసులను సంహరిస్తున్న శ్రీరామ లక్ష్మణులు, జనక మహారాజు సభలో శివ ధనస్సు విరుస్తున్న శ్రీరామ చంద్రుడు, సీతారామ కల్యాణ వైభోగం సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



రాజంపేట టౌన్ : బీజేపీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు



నందలూరు: జెండా ఆవిష్కరణలో కార్యకర్తలు, నాయకులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని సమద్ థియేటర్, పాత బస్టాండ్ సర్కిల్, మండలంలోని వైబీఎన్‌పల్లె గ్రామంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో రమేష్‌నాయుడు బీజేపీ జెండాను ఎగురవేసి, కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1980 ఏప్రిల్ 6వ తేదీ బీజేపీ ఆవిర్భవించినట్లు తెలిపారు.

నందలూరు : జాతీయ జనతా పార్టీ కేంద్ర, రాష్ట్ర పార్టీల ఆదేశానుసారం మండలంలో బీజేపీ పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలో కార్యకర్తలు, నాయకులు జరుపుకున్నారు. ఇందులో రాష్ట్ర గిరిజన మోర్చా నాయకుడు పోతురాజు మస్తానయ్య, రాష్ట్ర ఓబీసీ నాయకుడు గోపినేని హిమగిరినాథ్ యాదవ్ ఆధ్వర్యంలో మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని అరవపల్లి ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ఆదివారం పతాకావిష్కరణ చేశారు. అలాగే ప్రజలందరికీ భారతీయ జనతాపార్టీ కుటుంబ సభ్యులందరికీ స్వీట్లు పంచారు. అలానే మండలంలోని పాటూరు గ్రామంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు చుక్కా శ్రీనివాసులు, కార్యదర్శి మహేష్, మాజీ కార్యదర్శి మురళి, ఆధ్వర్యంలో వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట అసెంబ్లీ కో కన్వీనర్ డాక్టర్ అరిగే రాంప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఎస్‌బీవీడీ సభా హైస్కూల్‌లో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆపార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ జెండాను ఎగురవేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు కమలాపురం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మనదేశం కోసం, ధర్మం కోసం బీజేపీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కరోనా విలయం.. ఓ చేదు జ్ఞాపకం

ఐదేళ్ల కిందట గడగడలాడించిన కోవిడ్ గుర్తులు కళ్లు ఎదుట కనిపిస్తున్నాయి



కరోనా కారణంగా శానిటైజ్ చేసే ప్రక్రియలో నాటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి(ఫైల్)

రాయచోటి : నిద్రలేని రాత్రులు.. ఒకరిని చూసి మరొకరు భయపడే రోజులు.. ఎదురుగా పలకరిద్దాం అన్న నిలబడని మనిషి.. తుమ్మినా.. దగ్గిన వ్యక్తిని ఇంటి నుంచి వెలివేయడం, కోవిడ్ కేర్ సెంటర్‌కు తరలించడం పరిపాటి. పక్కింటి వ్యక్తితో కూడా కలవలేని దుస్థితి. వ్యాధిబారిన పడ్డ వారి యోగక్షేమాలను తెలుసుకోవడానికి ఆసుపత్రి వైపు చూడని కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు. అన్నింటికంటే భయంకర వ్యాధి బారిన పడి మృతిచెందిన వారి కడచూపునకు నోచుకోని దుర్భర పరిస్థితి నాటి రోజులవి. అవే నాటి కఠోరమైన కరోనా రోజులు.. అలాంటి దుర్భర రోజులు నేటికీ ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

రక్తబంధువులే మృతదేహాలను పట్టుకోవడానికి, సమీపంలోకి రావడానికి భయభ్రాంతులకు గురయ్యారు. ఆ వ్యాధి పేరే కరోనా.. ఐదేళ్ల క్రితం కరోనాలోని భయానక పరిస్థితులు నేటికీ జనాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. పూర్వం ప్లేగు, మశూచి, క్షయ వచ్చిన వారిని ఎక్కడో ఊరి చివర ఉంచేవారని, వారిని చూడటానికి రక్తబంధువులే వెళ్లే వారు కాదని చరిత్రలో చదువుకున్నాం. అయితే ఇప్పటి తరానికి అటువంటి దృశ్యాలను కళ్లారా చూపింది నిన్నటి కరోనా మహమ్మారి. ప్రపంచ వ్యాప్తంగా మానవ జీవితాలను అతలాకుతలం చేసి చరిత్రలో కోవిడ్-19 చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఎక్కడో చైనాలోని ఊహాన్‌లో పుట్టిన కరోనా వైరస్ ఖండాలు దాటి మానవాళిని భయభ్రాంతులకు గురిచేసి జీవనవిధానాన్నే మార్చేసింది.

కరోనాను ఎదుర్కొన్న ప్రజా ప్రభుత్వం

ప్రజల ప్రభుత్వంగా చెప్పుకునే జగన్ ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే కఠోరమైన కరోనా విలయతాండవం చేసింది. రాయచోటి నియోజకవర్గాన్ని కరోనా మహమ్మారి కబలించినా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతో నాటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి తన ప్రాణాన్ని సైతం లెక్క చేసుకుండా నియోజకవర్గ ప్రజలకు బాసటగా, తోడుగా నిలిచిన పరిస్థితులు నేటికీ ప్రజల కళ్లలో కదలాడుతున్నాయి. కరోనా వ్యాప్తి నిరోధానికి, ప్రజలను చైతన్యవంతులను చేయడానికి శ్రీకాంత్‌రెడ్డి ఒక సైనికుడిలా పనిచేసి తన నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తూ, మరోవైపు తన ఒసంత డబ్బులు, దాతల సహకారంతో శానిటైజర్లు, మాస్క్‌ల పంపిణీ, కోవిడ్ కేర్ సెంటర్లు ఏర్పాట్లు, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చేయడం, విస్తృతంగా కరోనా పరీక్షలు చేయించడం, కరోనా నివారణ చర్యలు, సహాయక సేవా కార్యక్రమాలపై తరచూ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షలు నిర్వహించి వారినీ భాగస్వాములు చేయడంలో సఫలీకృతులయ్యారు. అలానే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, కోవిడ్ ఆసుపత్రి, కేర్ సెంటర్లలో పర్యటిస్తూ బాధితుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు.



కరోనా రోగులను పరిశీలించేందుకు ఆసుపత్రులకు వెళ్తున్న శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)



పేదలకు బియ్యం ప్యాకెట్లను అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

బ్లాక్ ఫంగస్‌పై స్పందన

రాయచోటి పట్టణం సైదియా థియేటర్ వెనుకభాగపు వీధిలో నివసిస్తున్న ఓ మహిళకు బ్లాక్ ఫంగస్ లక్షణాలు కనిపించాయి. విషయం తెలుసుకున్న శ్రీకాంత్‌రెడ్డి బాధితురాలికి మెరుగైన వైద్యం అందివ్వాలన్న సదుద్దేశంతో వైద్యుల సలహా మేరకు హైదరాబాద్‌లోని కోఠి ఈఎన్‌టీ ప్రత్యేక ఆసుపత్రికి వెళ్లేందుకు అవసరమైన వాహనాన్ని, దారి ఖర్చులను శ్రీకాంత్‌రెడ్డి సమకూర్చారు.